క్లుప్తంగా

నాసా పోటీల్లో మూడో స్థానం



తెనాలిఅర్బన్: అమెరికాకు చెందిన నాసా నిర్వహించిన ఎస్ఎస్ఎఫ్ స్పేస్ సెటిల్ మెంట్ పోటీల్లో తెనాలి చెంచుపేటలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థిని మోహన లక్ష్మీ ప్రియాంక రూపొందించిన ఐ రోబో ప్రాజెక్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకుందని స్కూల్ ప్రిన్సిపల్ కె.మాధురి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో లక్ష్మీ ప్రియాంకను అభినందించి, బహుమతులు అందజేశారు. విద్యార్థిని త్వరలో అమెరికా వెళ్లనున్నట్లు చెప్పారు. ఒలింపియాడ్ పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌చార్జి జి.అప్పాజీ, ఏట గోపీచంద్, డీన్ రవి, సి బ్యాచ్ ఇన్‌చార్జి భగత్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బీ ఫార్మశీ ఫ్రెషర్స్‌డే వేడుకలు



తెనాలి: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజిలో బీ ఫార్మశీ ప్రథమ సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంపైనా అవగాహన పెంచుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



తెనాలిఅర్బన్: ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, కందుల సాంబశివరావు గౌడ్, విశ్వనాథ్, భీష్మ పాములు, సుబ్రమణ్యం, యలమంద తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత



తెనాలి: పట్టణంలోని రామలింగేశ్వర పేట 13వ వార్డు పరిధిలో యానాది కాలనీకి చెందిన యాకసిరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గురువారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందే సాయంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. వెల్ఫేర్ సెక్రటరీ తిరుపతయ్య, వలంటీరు పార్వతి, ఆర్‌పీ ఫాతిమా, పార్టీ నాయకులు కుర్రా శ్రీను, షారిపా, వీరయ్య, మల్లి ఉన్నారు.

యువతి ఆత్మహత్య

పట్నంబజారు: వివాహం చేసుకోవడం ఇష్టం లేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌కు చెందిన గోదా శ్రావణి (20) ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈ మధ్య ఆమెకు వివాహం నిశ్చమై తాంబూలాలు కూడా మార్చుకున్నారు. ఈ క్రమంలో వరుడు నచ్చలేదని పెద్దలకు కూడా శ్రావణి తెలిపింది. నిశ్చితార్థం జరిగిన క్రమంలో పెళ్లి ఆపడం కుదరదనడంతో మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఆమె నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి శాంతి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయమానం.. తెనాలి ఈద్గా

రమజాన్ ప్రార్థనలకు సుందరంగా తీర్చిదిద్దిన కమిటీ

తెనాలి: రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు జరిపే పట్టణ చెంచుపేటలోని ఈద్గా సరికొత్త శోభను సంతరించుకుంటోంది. ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు నెలలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నలువైపులా గల ప్రహరీని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. గోడలపై అన్నివైపులా నలభై మినార్‌లను ఏర్పాటు చేయటం మరో ప్రత్యేకత. వీటి లోపల విద్యుద్దీపాలను అమర్చారు. రాత్రి వేళల్లో విద్యుద్దీపాల కాంతిలో మినార్‌లు వర్ణ రంజితంగా మెరిసిపోతున్నాయి. మెయిన్ గేటు నుంచి లోపలకు వెళ్లగానే ముస్లింలు కాళ్లు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కూర్చునేందుకు వీలుగా ప్రతి టాప్ వద్ద అరుగును నిర్మించారు. అక్కడకు సమీపంలోని ఒక గదిపై మక్కా తరహాలో నిర్మాణం చేయటం మరో ప్రత్యేకత. ఇక్కడ కూడా మినార్‌లు ఏర్పాటు చేశారు. ఈద్గా పక్కనే గల సమాధుల స్థలం రెండో గేటుకు ఎదురుగా మదీనా ఆకృతిని నిర్మించారు. దాతల సాయంతో ఈద్గాను సుందరంగా తీర్చిదిద్దినట్టు ఈద్గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ వెల్లడించారు. నిపుణులైన ఆర్కిటెక్చర్ సాయంతో ముందుగా ఆకృతులను తయారు చేయించి, ఆ ప్రకారం నిర్మాణాలు పూర్తిచేయించామని తెలిపారు. ఈ సుందరీకరణలో కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, కోశాధికారి షేక్ సలీమ్, సభ్యులు పాలు పంచుకున్నారు.



మినార్‌లతో కూడిన మక్కా తరహా ఆకృతి



ఈద్గా కమిటీ నాయకులు



రంగుల ప్రహరీపై మినార్‌లు



మదీన ఆకృతి నిర్మాణం



ప్రార్థన జరిగే ప్రదేశం

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తెచ్చిన సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 25వ వార్డులో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 25 వార్డు పినపాడులోని సచివాయం నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఆధ్వర్యంలో వార్డు నాయకులు అధిక సంఖ్యల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల కింద ఇప్పటి వరకు రూ.2.08లక్షల కోట్ల నగదును నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అందించడం గతంలో జరగలేదన్నారు. అందుకే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. గతంతో పోల్చుకుంటే నేడు పాఠశాలలకు వెళ్లని పిల్లల సంఖ్యను వేళ్ల మీద లెక్కించవచ్చని ఎమ్మెల్యే వివరించారు. చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఆర్థిక భరోసాను కల్పించేందుకు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు అన్నాబత్తుని వివరించారు. 25వ వార్డులోని చెరువును పార్కుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నాలుగు ఐదు నెలల్లో దీనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు హామీ ఇచ్చారు. 25వ వార్డులో ప్రజలు తెలియజేసిన సమస్యలను గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20లక్షలతో పరిష్కరించనున్నట్లు శివకుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, పెదలంక లక్ష్మి లావణ్య, ఆవుల కోటయ్య, షేక్ ఇస్మాయేల్, కొమరబత్తిని జయపాల్, కో–ఆప్షన్ సభ్యులు గోరికపూడి నిర్మలాదేవి, 25వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు వై.మోహన్, మైలా సాంబశివరావు, షేక్ సుభాని, పి.అంజయ్య, కరేటి శ్రీను, షేక్ జిలాని, నన్నె సుభానీ, బెస్ట్ జిలానీ, అల్లా భక్షు, గఫూర్, షేక్ నన్నె, కర్యాప్దీన్, షేక్ సిలార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కళాకారిణి వెంకట పద్మజకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం సింహబలుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం మనుష్యులంతా ఒక్కటే చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ కళాకారిణి యల్లాప్రగడ వెంకట పద్మజను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సులోచన, కొక్కిలిగడ్డ సీతామహాలక్ష్మి, జక్కా పరమేష్, కొండ గిరీశం, జొన్నాదుల చంద్ర, సురేంద్ర, నాయబ్ రసూల్, అబ్దులా, బనరావూరి కోటేశ్వరరావు, ధనలక్ష్మి, లక్ష్మీప్రసన్న, సుజాత, మధువల్లి, ఫాతిమా, విజయలక్ష్మి, క్రాప లక్ష్మి, రాజకుమారి, నాగమని, సామ్రాజ్యం, శివలీల తదితరులు పాల్గొన్నారు.



పద్మజను సన్మానిస్తున్న సులోచన, సీతామహాలక్ష్మి

వైద్య శిబిరంలో ఎన్‌సీడీఎస్ వ్యాధుల గుర్తింపు

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన పోస్టాఫీసులో మూడురోజులుగా జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 12–14 శాతం నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల (ఎన్‌సీడీఎస్)ను నిర్ధారించారు. ప్రధాన పోస్టాఫీసు, బ్రాంచి ఆఫీసుల సిబ్బందికి బీపీ, షుగర్, బీఎంఐ, ఈసీజీ పరీక్షలు, మహిళలకు ప్రత్యేకంగా రొమ్ము క్యాన్సర్, పాప్ స్మియర్ (గర్భాశయ ముఖద్వార కాన్సర్ పరీక్ష) పరీక్షలను నిర్వహించారు. ఇందులో ఎన్‌సీడీఎస్ వ్యాధులను గుర్తించినందున వ్యాధి ముదరక ముందే రోగ విముక్తులు కావొచ్చని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ చెప్పారు. పోస్టల్ సిబ్బంది, ఖాతాదారులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించిన సొసైటీకి ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ, తగిన జాగ్రత్తలు తీసుకోవటం వల్ల ఎన్‌సీడీఎస్ వ్యాధులను రివర్సబుల్ చేయొచ్చని చెప్పారు. పట్టణంలోని 40 వార్డుల్లోనూ ఈ తరహా పరీక్షలు చేసినట్టు గుర్తుచేశారు. పోస్టమాస్టర్ ఎం.తిరుపతమ్మ, విశ్రాంత ఎస్‌పీఎం ఆర్ఎస్ రాజేశ్వరి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రమేష్

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడి చేశారు. నంది వెలుగు గ్రామ పరిధిలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,050లు, ఆరు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో శుక్రవారం హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు. జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.



జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

విద్యార్థిని అదృశ్యం

గుంటూరు ఈస్ట్: విద్యార్థిని అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. హిందూ కళాశాల డిగ్రీ విద్యార్థిని రెండు రోజుల కిందట కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకుండా ఏటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిజీషియన్ శాంపిల్స్ నిల్వకు జరిమానా

తెనాలి: ఫిజీషియన్ శాంపిల్స్ మందుల్ని అక్రమంగా నిల్వ ఉంచిన మురికి పూడి వేణుగోపాల్ అనే నిందితుడికి తెనాలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా రూ.30 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల మేరకు.. 2018 జనవరి 8న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పద్మ, మంగమ్మ స్థానిక సాలిపేటలోని ఓ ఇంటిలో సోదా చేశారు. మొదటి అంతస్తులో ఉంటున్న మురికిపూడి వేణుగోపాల్ దగ్గర కొన్ని ఫిజీషియన్ శాంపిల్స్ దొరికాయి. రెండో అంతస్తులోనూ మరికొన్ని మందులు దొరికాయి. ఆ రోజు సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి 3 గంటల వరకు జరిగిన సోదాల్లో 191 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌ల దగ్గర్నుంచి శాంపిల్ మందులు కొనుగోలు చేసి, వాటిని అమ్ముతున్నట్లు నిర్ధారించుకున్నారు. శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. నేరం రుజువైనందున న్యాయమూర్తి జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

కుల జన గణనతోనే న్యాయం



తెనాలి: కుల జన గణనతోనే అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, అఖిల భారత గౌడ సంఘం జిల్లా యువత అధ్యక్షుడు కందుల వేణు వర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా కుల జన గణన కోసం బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కుల గణన నిర్వహించటానికి నిర్ణయించటం గొప్ప విషయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ నేతగా ఎంతో గర్వించదగినదిగా పేర్కొన్నారు. కుల జన గణనకు రాష్ట్రస్థాయి అధ్యయన కమిటీ ఏర్పాటుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రిని సీఎం ఆదేశించినట్టు గుర్తుచేశారు. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బిహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తోందని, నివేదిక సమర్పించిన అనంతరం బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుందని వివరించారు. పార్టీల కతీతంగా ప్రతి ఒక్క బీసీ నేత రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అభిప్రాయాలను ప్రకటించాలని కోరారు.

కృష్ణ మాదిగకు ఘన స్వాగతం

తెనాలిరూరల్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తెనాలి చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో జరుగనున్న నేపథ్యంలో విగ్రహ విష్కరణకు విచ్చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థి విభాగం ఘన స్వాగతం పలికింది. గురువారం రాత్రి తెనాలి చేరుకున్న కృష్ణ మాదిగను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. వైకుంఠపురం సమీపం నుంచి ర్యాలీ ప్రారంభమై తెనాలి కొత్త వంతెన, టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డు, బోస్‌రోడ్డు, నెహ్రూ రోడ్డు, రజక చెరువు సెంటర్, ఐతానగర్, ఓవర్ బ్రిడ్జి, చెంచుపేట మీదుగా సభాస్థలికి చేరుకుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో మాదిగ విద్యార్థి విభాగం నాయకులు కృష్ణ మాదిగకు స్వాగతం పలికారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు కూచిపూడి సత్యం మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకుడు చిలక కిరణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కోకన్వీనర్ ధనరాజు పల్లి కిషోర్ మాదిగ, సాపాటి కిరణ్, కోపల్లె శీను తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తూ.. ర్యాలీగా వెళ్తున్న కృష్ణమాదిగ, నాయకులు

ఆకట్టుకున్న 'రైతే రాజు' నాటిక

పాత గుంటూరు: కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌బ్ రీడింగ్ రూంలో వైష్ణవి ఫిలిమ్స్, కళా విపంచి, గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, ఎన్‌టీఆర్ కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వై.కె. నాగేశ్వరరావు ద్వితీయ నాటకోత్సవాల్లో భాగంగా గురువారం 'రైతే రాజు' నాటిక సందేశాత్మకంగా సాగింది. అనంతరం వై.కె. నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారాన్ని పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావుకు అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కళా విపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, రామరాజు శ్రీనివాసరావు తదితరులు జ్యోతి ప్రకాశనంతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి శ్రీ రాంగోపాల్, గజల్ శ్రీనివాస్ , కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు డాక్టర్ కథక్ అంజిబాబు, డాక్టర్ ఎండీ.రఫీ, ఆలయ ఉపాధ్యక్షులు లంక విజయబాబు, లక్కరాజు సునీత పాల్గొన్నారు. కార్యక్రమాల్ని డి.తిరుమలేశ్వరరావు, శంకర్, జి. మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశించారు. కాంట్రాక్టర్లతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెలాఖరు లోపు పెదరావూరు, జగ్గడిగుంటపాలెంలోని జగనన్న కాలనీల్లో కనీసం ఒకొక్కరు 50 ఇళ్ల నిర్మాణ పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. వేసవిలో నిర్మాణ పనులు చేసే అవకాశం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాంట్రాక్టర్లు ఆ దిశగా ప్రణాళిక రూపొదించుకోవాలన్నారు. ప్రభుత్వం మెటిరియల్ సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని ఇళ్లు పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కూడా సకాలంలో పడుతున్నందున త్వరితిగతిన పనులు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కమిషనర్ ఎం.జశ్వంత రావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్, సమావేశంలో చైర్ పర్సన్ ఖాలేదా నసీమ్

30న అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి: శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో ఈ నెల 30న అన్నమయ్య పాటల పోటీలను నిర్వహించనున్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో గురువారం సంబంధిత బ్రోచర్‌ను మున్సిపల్ కౌన్సిలరు గౌడవర్తి సాయి హరేరామ్, కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, కాసూరు వెంకట రామకృష్ణ, పర్చూరు సుబ్బారావు, లక్కరాజు లక్ష్మణరావు ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. దేవస్థానం వెనుక వైపున గల గీతామందిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నమయ్య పాటల పోటీలను నిర్వహిస్తామని కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వయసు గల వారు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. మొదటి నాలుగు బహుమతులు నలుగురు చొప్పున, మరో 20 ప్రోత్సాహక బహుమతులు కలిపి మొత్తం 32 మందికి నగదు బహుమతులు ఇస్తామని వివరించారు. కేవలం అన్నమయ్య పాటల పోటీల ప్రచారం నిమిత్తం నిర్వహిస్తున్నందున ఈ పోటీల్లో వృత్తిపరమైన గాయకులకు అనుమతి లేదన్నారు. పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక, వర్ధమాన గాయనీగాయకులు పాల్గొనవచ్చని వివరించారు. ఆసక్తిగల వారు ఈ నెల 25వ తేదీ లోగా 92464 40685 నంబరుకు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



బ్రోచర్ ఆవిష్కరించిన సాయి హరేరామ్, శ్రీనివాసరావు ప్రభృతులు

'జగనన్నే మా భవిష్యత్తు'అని మద్దతిస్తూ..



2వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న కౌన్సిలర్ పద్మజ, కన్వీనర్ ప్రభాకర్



40వ వార్డులో బుక్‌లెట్ అందిస్తున్న కౌన్సిలర్ నాగవేణి

తెనాలిఅర్బన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం తెనాలిలో గురువారం పండుగ వాతావరణంలో కొనసాగింది. వార్డు కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లను ప్రజలు అప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. పట్టణంలోని దాదాపు అన్ని వార్డులో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను ప్రతి ఇంటికి అంటించారు. రెండోవ వార్డులో కౌన్సిలర్ అన్నాబత్తుని పద్మజ, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ తెనాలి పట్టణ కన్వీనర్ మన్నవ ప్రభాకర్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కాకి దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు. 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి, మూడోవ వార్డులో కౌన్సిలర్ ఆవుల కోటయ్య ఆయా వార్డుల్లో ప్రచారం నిర్వహించారు.